క్లుప్తంగా

ఆర్టీసీ బస్సు నడపండి

ఉద్దాండపూర్ గ్రామస్తుల వినతి

తాండూరు రూరల్: మండల పరిధిలోని ఉద్దాండపూర్ గ్రామానికి ఆర్టీసీ బస్సును నడపాలని గ్రామస్తులు కోరారు. కొన్ని నెలల నుంచి బస్సు రాకపోవడంతో పాఠశాల విద్యార్థులతో పాటు గ్రామస్తులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. తాండూరు పట్టణం నుంచి అడికిచెర్లకు బస్సు సౌకర్యం ఉందని, ఈ బస్సు సర్వీస్సు తమగ్రామానికి రాకుండా గుండ్లమడుగుతండా నుంచి అడికిచెర్ల వెళ్తుందని చెప్పారు. దీంతో పాఠశాల, కళాశాలకు వెళ్లే విద్యార్థులు 2 కిలో మీటర్లదూరం కాలినడకన గ్రామానికి వస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషయంలో ఆర్టీసీ అధికారులు స్పందించి ఉద్దాండపూర్ గ్రామానికి బస్సు సౌకర్యం కల్పించాలని కోరారు.

పాఠశాలల్లో ఏఐ విద్యాబోధన

ఎంఈఓ రాంరెడ్డి



శిక్షణ పూర్తి చేసుకున్న ఉపాధ్యాయ సిబ్బందితో ఎంఈఓ రాంరెడ్డి

కొడంగల్ రూరల్: ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలల్లో ఏఐ విద్యాబోధన ప్రారంభం కానుందని ఎంఈఓ రాంరెడ్డి పేర్కొన్నారు. బుధవారం పట్టణంలోని జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాల ఆవరణలో ఇటీవల మూడు రోజుల శిక్షణలో భాగంగా గణితం, ఫిజికల్ సైన్స్, ప్రాథమిక పాఠశాలల హెచ్ఎంలు పాల్గొన్నారని తెలిపారు. నియోజకవర్గంలోని కొడంగల్, దౌల్తాబాద్, బొంరాస్‌పేట, దుద్యాల్ మండలాల పరిధిలోని ఉపాధ్యాయులు సంబంధిత సబ్జెక్టుల్లో శిక్షణ పూర్తి చేసుకున్నారని పేర్కొన్నారు.

అతిథి అధ్యాపకుల నిరసన

బకాయి వేతనాలు విడుదల చేయాలని ధర్నా



ఇంటర్ కార్యాలయం ఎదుట నిరసన వ్యక్తం చేస్తున్న అతిథి అధ్యాపకులు

అనంతగిరి: తొమ్మిది నెలల వేతనాలు విడుదల చేయాలని పలువురు అతిథి అధ్యాపకులు నిరసన వ్యక్తం చేశారు. బుధవారం వికారాబాద్ జిల్లా ఇంటర్ నోడల్ అధికారి కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా నోడల్ అధికారి శంకర్‌నాయక్‌కు వినతిపత్రం అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ గత విద్యా సంవత్సరంలో 4నెలల , ఈ విద్యా సంవత్సరంలో 5నెలలు గడిచినప్పటికీ వేతనాలు అందక తీవ్ర ఇబ్బందులు పడుతున్నామన్నారు. జిల్లాలో 47మంది అతిథి అధ్యాపకులు ఉన్నామని, అప్పులు చేసి కుటుంబపోషణ చేస్తున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం ఇప్పటికైన స్పందించి వెంటనే వేతనాలు చెల్లించాలన్నారు.

ఎస్ఐపై చర్యలు తీసుకోండి

బషీరాబాద్: అక్రమ కేసు నమోదు చేసిన బషీరాబాద్ ఎస్ఐ నుమాన్‌అలీపై చర్యలు తీసుకోవాలని దివ్యాంగుల సంఘం ప్రతినిధులు ఎస్పీ నారాయణరెడ్డికి ఫిర్యాదు చేశారు. బుధవారం బాధితులు చెరుకు రాజుగౌడ్, అర్చనతో కలిసి దివ్యాంగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కాళ్ల జంగయ్య వినతిపత్రం అందజేశారు. దామర్‌చెడ్ గ్రామానికి చెందిన బోయిని వెంకటప్ప తాగొచ్చి రాజుపై, అడ్డుకోబోయిన అతడి భార్య అర్చనపై దాడి చేయడంతో పాటు దూశించారని వివరించారు. అదే సమయంలో 100కి కాల్ చేసి ఫిర్యాదు చేయడంతో పాటు మరునాడు పోలీస్ స్టేషన్‌లో రాతపూర్వకంగా కూడా ఫిర్యాదు చేసినట్లు వారు ఎస్పీకి వివరించారు. అయితే బాధితుడు ఇచ్చిన ఫిర్యాదును పక్కన పెట్టి దాడి చేసిన వ్యక్తికి గాయాలయ్యాయని, ఒక్కోసారి ఒక్కో విధంగా ఎస్ఐ చెప్పడం అనుమానాలకు తావిస్తోందని చెప్పారు. ఈ ఘటనపై విచారణ జరిపించి ఎస్ఐపై చర్యలు తీసుకోవాలని కోరారు. దీనిపై స్పందించిన ఎస్పీ వెంటనే తాండూరు రూరల్ సీఐ, బషీరాబాద్ ఎస్ఐకి ఫోన్‌లో మాట్లాడినట్లు పేర్కొన్నారు. తమకు న్యాయం జరగకుంటే డీజీపీ దగ్గరకు వెళ్తామన్నారు. వీహెచ్‌పీఎస్ రాష్ట్ర కోశాధికారి శ్రీనివాస్‌చారి, జిల్లా మహిళా అధ్యక్షురాలు జర్నమ్మ, ఎమ్మార్పీఎస్ జిల్లా ఇన్‌చార్జి క్రిష్ణ, మండల అధ్యక్షుడు నర్సిములు, అంజిలప్ప తదితరులు పాల్గొన్నారు.

బోధనేతర పనులు చెప్పకండి

ధారూరు: ప్రభుత్వ పాఠశాలల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయులకు బోధనేతర పనులు చెప్పొద్దని టీఎస్‌యూటీఎఫ్ డిమాండ్ చేసింది. బుధవారం ధారూరు మండలంలోని తరిగోపుల, కేరెల్లి, మైలారం, గురుదోట్ల, అంపల్లి, స్టేషన్‌ధారూరు, పీసీఎం తండా, ధారూరు, శేరిగడ్డ తండా, జీడీగడ్డ తండాల పాఠశాలల్లో సభ్యత్వ నమోదు నిర్వహించారు. ఈ సందర్భంగా టీఎస్‌యూటీఎఫ్ అధ్యక్షుడు వెంకటరత్నం మాట్లాడారు. ఆయా పాఠశాలల్లో విద్యార్థులకు కేటాయించిన బోధన సమయం గడిచిపోయి బోధన కుంటుబడుతుందని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు.

కంపోస్టు షెడ్లు నిరుపయోగం!

రూ. లక్షలు వెచ్చించి నిర్మాణం
- నెరవేరని ప్రభుత్వ లక్ష్యం
- రోడ్లపైనే చెత్తాచెదారం
- పట్టించుకోని అధికారులు



నీటూరులోని కంపోస్టు షెడ్

దౌల్తాబాద్: పల్లెలను పరిశుభ్రంగా ఉంచాలనే ఉద్దేశంతో గత బీఆర్ఎస్ ప్రభుత్వం పల్లెప్రగతి కార్యక్రమాన్ని తీసుకొచ్చింది. పట్టణాల మాదిరి పల్లెల్లోనూ ఇంటింటికి తిరుగుతూ చెత్తను సేకరిస్తున్నారు. తడి, పొడి చెత్తను వేరు చేసి ఇవ్వాలని ప్రజలకు అవగాహన కల్పించడంలో పంచాయతీ అధికారులు పారిశుద్ధ్య సిబ్బంది విఫలమవుతున్నారు. దీంతో చెత్త దిబ్బల్లోనే అంతా ఒకే చోట పారబోయాల్సి వస్తోంది. కొన్ని పంచాయతీల్లో అమలు చేస్తున్నా ఎక్కువ గ్రామాల్లో అమలు కావడంలేదు.

అలంకారప్రాయంగా నిర్మాణాలు

మండలంలో 33 గ్రామపంచాయతీలు ఉన్నాయి. ప్రతి పంచాయతీకి రూ.లక్షలు ఖర్చు చేసి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కంపోస్టుషెడ్లను నిర్మించారు. తడి, పొడి చెత్తను వేర్వేరుగా వేయాలంటూ విడిగా గోడలను కట్టారు. ప్లాస్టిక్ డబ్బాలు, సీసాలు, పేపర్లు, అట్టముక్కలు, కరెంటు వస్తువులు పాత దుస్తులు ఇలా విడివిడిగా వేసేందుకు ఏర్పాట్లు చేశారు. చెత్తసేకరణకుగాను ఇంటింటికి నీలి, ఆకుపచ్చ రంగుల బుట్టలను కూడా ఉచితంగా పంపిణీచేశారు. అయితే వాటిని ఒకేసారి అందజేసి చేతులు దులుపుకున్నారు. గ్రామానికి ఒక ట్రాక్టర్‌ను కూడా అందుబాటులో ఉంచారు. పల్లెల్లో తడి, పొడి చెత్తను వేరు చేయకపోవడంతో పంచాయతీ కార్మికులు షెడ్లలో వేరుచేయడం లేదు. దీంతో చెత్తను వేరుచేసే పద్ధతి పూర్తి స్థాయిలో అమలుకు నోచుకోకపోవడంతో కంపోస్టుషెడ్‌లు కూడా వృథాగానే మిగిలిపోతున్నాయి.

రైతులకు మేలు

తడి చెత్తను విడిగా సేకరిస్తే కంపోస్టు షెడ్ల తొట్టిలో వేసి సేంద్రియ ఎరువును తయారు చేసుకోవచ్చు. ప్రతి పంచాయతీలో గతంలో వానపాములను కొనుగోలు చేసేవారు. సేంద్రియ ఎరువు తయారీకి 40–60 రోజుల సమయం పడుతుంది. బస్తా (50కిలోలు) రూ.650ల వరకు తీసుకుంటున్నారు. అదే గ్రామంలో తయారు చేస్తే కేవలం రూ.200లు తీసుకోవచ్చు. ఈ ఎరువు తయారీతో రైతులకు మేలు కలుగుతుంది. సేంద్రియ ఎరువుల వాడకం వల్ల దిగుబడి కూడా బాగుంటుందని వ్యవసాయధికారులు చెబుతున్నారు.

> **అవగాహన కల్పిస్తాం**
>
> తడి, పొడి చెత్తను వేరు చేసి ఇవ్వాలని ఇప్పటికే పలుమార్లు గ్రామాల్లో అవగాహన కల్పించాము. కొన్ని పంచాయతీల్లో అమలవుతుంది. తడి చెత్త, వాన పాములతో కంపోస్టు షెడ్లలో సేంద్రియ ఎరువు తయారు చేస్తున్నాము. మరోసారి గ్రామాల్లో అవగాహన కల్పించి పూర్తి స్థాయిలో అమలుకుచర్యలు తీసుకుంటాము.
>
> – శ్రీనివాస్, ఎంపీడీఓ, దౌల్తాబాద్

తండాల అభివృద్ధి కాంగ్రెస్‌తోనే సాధ్యం

పార్టీ మండల అధ్యక్షుడు శేఖర్



గ్రామ పంచాయతీ భవన నిర్మాణానికి భూమి పూజ చేస్తున్న నాయకులు

దుద్యాల్: తండాల అభివృద్ధి కాంగ్రెస్ ప్రభుత్వంతోనే సాధ్యమని మండల అధ్యక్షుడు ఆవుటి శేఖర్ పేర్కొన్నారు. బుధవారం సత్తర్ కుంట తండాలో రూ.30లక్షల వ్యయంతో నూతన గ్రామ పంచాయతీ కార్యాలయ నిర్మాణానికి కొడంగల్ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ ఆకారం వేణుగోపాల్‌తో కలిసి భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత ప్రభుత్వ హయాంలో తండాలను పట్టించుకోకపోవడంతో వెనుకపడిపోయాయన్నారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ రాజ్ ఏఈ సురేందర్ రెడ్డి, ఎస్టీ సెల్ మండల అధ్యక్షుడు రవి నాయక్, యాదవ సంఘం మండల అధ్యక్షుడు కావలి నర్సిములు, రవి రాథోడ్, దేవిదాస్, పాండు నాయక్, హరిచంద్, శివరాం నాయక్, రాజు, నరేశ్ రాథోడ్, గన్య నాయక్, దేశ్య నాయక్, నర్సింహ రెడ్డి, వెంకట్ రెడ్డి, కృష్ణ, శివ కుమార్, తదితరులు పాల్గొన్నారు.

చిరుధాన్యాలతో సంపూర్ణ ఆరోగ్యం



పోషక ఆహార ప్రదర్శనలో ఎంపీడీఓ రాములు

ఎంపీడీఓ రాములు

బంట్వారం: గర్భిణులు, బాలింతలు చిరుధాన్యాలతో కూడిన ఆహారం తీసుకుంటే సంపూర్ణ ఆరో గ్యం చేకూరుతుందని ఎంపీడీఓ రాములు పేర్కొన్నారు. బుధవారం బంట్వారం మండల కేంద్రంలో ని అంగన్‌వాడీ కేంద్రంలో పోషణ మాసోత్సవాలు నిర్వహించి, పోషక ఆహార ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఆకు కూరల్లో విటమిన్లు ఎక్కువగా ఉంటాయని, ప్రతీ రోజు ఆహారంలో వాటిని తీసుకోవాలన్నారు. అనంతరం పోషక ఆహారంపై ఆయన అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ వెంకటేశ్వర్‌రావు, మెడికల్ ఆఫీసర్ మజీద్‌ఖాన్, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ధనలక్ష్మి, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

విద్యార్థులు మంచి మార్కులు సాధించాలి

ఎమ్మెల్యే కాలె యాదయ్య



విద్యార్థులకు నోట్ బుక్స్ అందజేస్తున్న ఎమ్మెల్యే యాదయ్య

నవాబుపేట: ప్రభుత్వ పాఠశాలల్లోని పదోతరగతి విద్యార్థులు బాగా చదివి మంచి మార్కులు సాధించాలని ఎమ్మెల్యే కాలె యాదయ్య పేర్కొన్నారు. మంల పరిధిలోని చించల్‌పేట ఉన్నత పాఠశాలలో పదోతరగతి విద్యార్థులకు ఎమ్మెల్యే నోట్‌బుక్స్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో పేదలే ఎక్కువగా విద్యనభ్యసిస్తారన్నారు. కాబట్టి వారందరికీ మెరుగైన విద్య అందజేయాలని ఉపాధ్యాయులకు సూచించారు. ప్రభుత్వం సైతం విద్యకు అధిక ప్రాధాన్యత నిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎం పాండు, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

సబ్సిడీపై శనగ విత్తనాలు

నవాబుపేట: జాతీయ ఆహార భద్రత మిషన్ కింద సబ్సిడీపై శనగ విత్తనాలు పంపిణీ చేయనున్నట్లు మండల వ్యవసాయాధికారి జ్యోతి తెలిపారు. గురువారం విత్తనాలను స్థానిక ఎమ్మెల్యే కాలె యాదయ్య పంపిణీ చేస్తారని ఒక ప్రకనలో తెలిపారు. మండలానికి ప్రస్తుతం 100 బ్యాగులు వచ్చినట్లు వివరించారు. ఒక్కో బ్యాగు(25కేజీలు) సబ్సిడీ రూ.1,500లకు పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. విత్తనాలు కావాల్సిన రైతులు పాస్‌బుక్ జిరాక్సు, ఆధార్ కార్డు వెంట తీసుకురావాలని తెలిపారు.

బీసీ రిజర్వేషన్ అమలు చేయాలి

కొడంగల్ రూరల్: 42శాతం బీసీ రిజర్వేషన్లను అమలు చేయాలని సీపీఐ నియోజకవర్గ నాయకులు గంటి సురేశ్‌కుమార్ డిమాండ్ చేశారు. బుధవారం పట్టణంలోని అంబేడ్కర్ చౌరస్తాలో నిరసన వ్యక్తం చేశారు. జనాభాను లెక్కించి దాని ప్రకారమే జీవో తెచ్చారని, కొందరు కోర్టుకెళ్లడం ద్వారా దాన్ని కొట్టివేయడం బాధాకరమన్నారు. ఈ విషయంలో పార్లమెంటులో చట్టం చేయకుండా మోదీ ప్రభుత్వం అడ్డుపడుతుందని విమర్శించారు. ఈ కార్యక్రమంలో సీపీఐ నాయకులు శంకర్ నాయక్, హుస్సేన్, భీమప్ప, రాజు తదితరులు పాల్గొన్నారు.

కార్యదర్శిని బదిలీ చేయొద్దు

తాండూరు రూరల్: మండల పరిధిలోని అల్లాపూర్ పంచాయతీ కార్యదర్శి శ్రీనాథ్‌ను బదిలీ చేయొద్దని గ్రామస్తులు కోరారు. బుధవారం ఎంపీడీవో విశ్వప్రసాద్‌కు గ్రామస్తులు కలిసి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా గ్రామస్తులు మాట్లాడుతూ..అల్లాపూర్ పంచాయతీ కార్యదర్శిగా విధులు నిర్వహిస్తున్న శ్రీనాథ్‌ను బషీరాబాద్ మండలానికి బదిలీ చేయడం బాధాకరమన్నారు. నిత్యం ప్రజలకు అందుబాటులో ఉండేవాడని గుర్తు చేశారు. ఈ విషయం గురించి అధికారులు స్పందించి కార్యదర్శిని అల్లాపూర్‌లోనే కొనసాగించాలని మొరపెట్టుకున్నారు.

పింఛన్ పెంచే వరకు ఉద్యమం ఆగదు

అనంతగిరి: ప్రభుత్వం ఫించన్ పెంచే వరకు ఉద్యమం ఆపే ప్రసక్తే లేదని వికలాంగుల హక్కుల పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షుడు కాళ్ల యాదయ్య తెలిపారు. బుధవారం వికారాబాద్‌లోని వీహెచ్‌పీఎస్ జిల్లా ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలు అమలు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఆనందం, ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు మల్లికార్జున్, రాష్ట్ర కార్యదర్శి నాగార్జున, శ్రీనివాస్ చారి, విజయ్‌కుమార్ నర్సింలు తదితరులు పాల్గొన్నారు.

మద్యం తాగి వాహనాలు నడపొద్దు

చన్గోముల్ ఎస్ఐ భరత్‌రెడ్డి



వాహనాలను తనిఖీ చేస్తున్న పోలీసులు

పూడూరు: మద్యం సేవించి వాహనాలు నడిపితే చర్యలు తప్పవని చన్గోముల్ ఎస్ఐ భరత్‌రెడ్డి పేర్కొన్నారు. బుధవారం మండల పరిధిలోని కొత్తపల్లి గేటు వద్ద హైదరాబాద్ బీజాపూర్ రోడ్డుపై వాహనాల తనిఖీ నిర్వహించారు. ద్విచక్ర వాహనాదారులు తప్పనిసరిగా హెల్మెంట్ ధరించాలని సూచించారు. ప్రమాదాలు జగినప్పుడు ప్రాణాపాయం నుంచి తప్పించుకోచ్చన్నారు. మద్యం సేవించి వాహనాలు నడిపి అమాయకుల ప్రాణాలతో చెలగాటం ఆడొద్దని సూచించారు. డ్రంక్‌అండ్ డ్రైవ్‌లో పట్టుబడితే జైలు శిక్ష తప్పదని, బండిని సీజ్ చేయడంతో పాటు లైసెన్సు రద్దు చేస్తామని హెచ్చరించారు. ట్రాఫిక్ నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని వాహనాదారులను కోరారు. ఈ సందర్భంగా సంబంధిత ధ్రువపత్రాలు లేని, నంబర్ ప్లేట్‌లు సక్రమంగా లేని పలు వాహనాలకు ఛలాన్లు విధించారు. ఈ తనిఖీల్లో హెడ్‌కానిస్టేబుల్ వెంకటయ్య, సిబ్బంది నగేశ్, మహేందర్, గోపాల్, మహేశ్, అంజి, తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ సేవలు సద్వినియోగం చేసుకోవాలి



స్టార్ మదర్స్‌ను సన్మానిస్తున్న ఉపాధ్యాయులు, అంగన్‌వాడీ టీచర్స్

రాంనగర్ ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు స్వప్న

కుల్కచర్ల: అంగన్‌వాడీ కేంద్రాల సేవలు సద్వినియోగం చేసుకోవాలని రాంనగర్ ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు స్వప్న పేర్కొన్నారు. బుధవారం రాంనగర్ గ్రామపంచాయతీ పరిధిలోని అంగన్‌వాడీ కేంద్రంలో పోషణమాసోత్సవాలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను మహిళలు పూర్తిస్థాయిలో సద్వినియోగం చేసుకుని స్టార్ మదర్స్‌గా నిలిచిన మంగమ్మ, లావణ్యలను సన్మానించారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్‌లు ఎస్. మల్లమ్మ, ఏ.మల్లమ్మ తదితరులు పాల్గొన్నారు.

స్వదేశీ ఉద్యమంతోనే దేశాభివృద్ధి

జాగరణ మంచ్ అఖిల భారతీయ సహ సంఘటన మంత్రి సతీశ్ కుమార్ జీ



ప్రతిజ్ఞ చేయిస్తున్న సతీశ్ కుమార్ జీ

అనంతగిరి: స్వదేశీ ఉద్యమంతోనే దేశాభివృద్ధి సాధ్యమని స్వదేశీ జాగరణ మంచ్ అఖిల భారతీయ సహ సంఘటన మంత్రి సతీశ్ కుమార్ జీ పేర్కొన్నారు. జిల్లా స్వదేశి జాగరణ మంచ్ ఆధ్వర్యంలో బుధవారం వికారాబాద్‌లోని బసంత్ ఫంక్షన్ హాల్లో స్వదేశీ జాగరణ మహోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సతీశ్ కుమార్ జీ మాట్లాడుతూ దేశ ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేయాలంటే స్వదేశీ వస్తువుల వినియోగం పెంచాలని, విదేశీ వస్తువులను బహిష్కరించాలన్నారు. దీంతో ఆత్మనిర్భర భారత్ సాధ్యమవుతుందన్నారు. యువత టెక్నాలజీ ఆధారంగా స్వయం ఉపాధి అవకాశాలను సృష్టించి ఇతరులకు ఉద్యోగాలను కల్పించే దిశగా ముందుకు సాగాలని సూచించారు. ఈ కార్యక్రమంలో స్వదేశీ జాగరణ మంచ్ క్షేత్ర సంయోజకులు డాక్టర్ సత్తు లింగమూర్తి, పట్టణ ప్రముఖులు జనాబాయి, డాక్టర్ నరేందర్ రెడ్డి, రావులపల్లి శేఖర్ రెడ్డి, మహేశ్వర్, సుధాకర్ రెడ్డి, ప్రాంత కన్వీనర్ ఈశ్వర్, విభాగ్ కన్వీనర్ ప్రభాకర్ రెడ్డి, జిల్లా కన్వీనర్ మహేందర్ రెడ్డి, మహిళా కన్వీనర్ సుజాత, కో కన్వీనర్ శివశంకర్, బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు సదానంద రెడ్డి, విజయ భాస్కర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కలాం సేవలు మరువలేనివి



తాండూరు రూరల్: అబ్దుల్‌కలాం చిత్రపటంతో డీఎస్పీ బాలకృష్ణారెడ్డి, విద్యార్థినులు

తాండూరు రూరల్: జినుగుర్తి గేటు సమీపంలో కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో బుధవారం మాజీ రాష్ట్రపతి డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం జయంతి నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా డీఎస్పీ బాలకృష్ణారెడ్డి మాట్లాడారు. అబ్దుల్‌కలాం దేశానికి చేసిన సేవలు మరువలేనివన్నారు. ఈ కార్యక్రమంలో రామకృష్ణ సేవా సమితి అధ్యక్షుడు బస్వరాజ్, రిటైర్డ్ ప్రిన్సిపాల్ బాలకృష్ణ, విద్యావేత్త కీర్తిశర్మ, కవయిత్రి మొల్ల, కళావేదిక ఫౌండర్ కేవీఎం వెంకట్, ప్రిన్సిపాల్ ఆశలత, ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు.

కొడంగల్ రూరల్: అబ్దుల్‌కలాం జయంతిని పట్టణంలోని నవీన ఆదర్శ ప్లే హైస్కూల్ ఆవరణలో ఘనంగా జరుపుకున్నారు. పాఠశాల ప్రాంగణంలో అబ్దుల్ కలాం చిత్ర పటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రిన్సిపాల్ డివి నరేశ్‌రాజ్ మాట్లాడుతూ భారత అణు శాస్త్రవేత్తగా, రాష్ట్రపతిగా దేశానికి ఎంతో సేవ చేశారని కొనియాడారు.

విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు



మాట్లాడుతున్న ఎంపీడీఓ గ్యామా

ఎంపీడీవో గ్యామా

దోమ: విధి నిర్వహణలో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని ఎంపీడీవో గ్యామా హెచ్చరించారు. బుధవారం దోమ మండల కేంద్రంలో పంచాయతీ కార్యదర్శులు, టీఏ, ఏఫ్ఏలకు సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..ప్రతి గ్రామంలో పారిశుద్ధ్యంపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. ప్రభుత్వం ప్రజా సంక్షేమమే ధ్యేయంగా పని చేస్తుందని, పంచాయతీ కార్యదర్శులు ఎవరు కూడా నిర్లక్ష్యం వహించొదన్నారు. గ్రామాల్లో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులు కొనసాగుతున్నాయని, త్వరితగతిన నిర్మించుకునేందుకు శ్రద్ధ చూపాలన్నారు. ప్రతీ ఇంటి పన్నులు సకాలంలో వసూలు చేయాలన్నారు. జాబ్‌కార్డు కలిగిన కూలీలందరివి ఈ కేవైసీ పూర్తి చేయాలన్నారు. వనమహోత్సవంలో మొక్కలు నాటించేలా కృషి చేయాలని తెలిపారు.

విద్యార్థులపై నిర్లక్ష్యంగా వ్యవహరించొద్దు..

విద్యార్థులపై ఉపాధ్యాయులు నిర్లక్ష్యంగా వ్యవహరించొద్దని ఎంపీడీఓ గ్యామా, ఎంఈఓ వెంకట్ పేర్కొన్నారు. బుధవారం దోమ మండల కేంద్రంలోని కస్తూర్బాగాంధీ పాఠశాలను తనిఖీ చేశారు. ముందుగా పాఠశాల పరిసరాలను పరిశీలించారు. అనంతరం వంట గదిని చూశారు. విద్యార్థులకు వండిపెడుతున్న కూరగాయలను పరిశీలించి, పౌష్టికాహారం వండి పెట్టాలన్నారు. ప్రతి విద్యార్థి శ్రద్ధతో చదువుకొని పాఠశాలకు తల్లిదండ్రులకు కీర్తి తీసుకురావాలన్నారు.

సమయపాలన పాటించాలి

పరిగి: ఉపాధ్యాయులు సమయపాలన పాటించాలని మండల విద్యాధికారి గోపాల్ సూచించారు. బుధవారం మండల పరిధిలోని తొండపల్లి ప్రాథమిక పాఠశాలను సందర్శించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఉపాధ్యాయులు మెరుగైన బోధన నిర్వహించాలని తెలిపారు. విద్యార్థుల హాజరును ప్రతిరోజు ఎఫ్ఆర్ఎస్ యాప్‌లో ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని సూచించారు. ప్రభుత్వ పాఠశాలలపై నమ్మకం పెరగాలంటే ఉపాధ్యాయులు తమ విధులను సక్రమంగా నిర్వర్తించాలన్నారు. విద్యార్థులు మంచి ఫలితాలు సాధించినప్పుడే పాఠశాలలకు కీర్తి వస్తుందన్నారు.

పశువులకు టీకాలు తప్పనిసరి

జిల్లా పశు సంవర్ధక శాఖ అధికారి సదానందం

దోమ: పాడి రైతులు గాలికుంటు టీకాలు తప్పనిసరిగా వేయించాలని జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి సదానందం సూచించారు. బుధవారం శివారెడ్డిపల్లి గ్రామంలో మొబైల్ వ్యాక్సినేషన్‌ను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా సదానందం మాట్లాడారు. గాలి కుంటు వ్యాధి సోకిన పశువుల్లో పాల ఉత్పత్తి గణనీయంగా తగ్గుతుందన్నారు. రైతులు ఈ వ్యాధిని మొదటి దశలోనే గుర్తించి పశువైద్యాధికారుల సలహాలు సూచనలు తీసుకుంటూ పశువులను సంరక్షించుకోవాలన్నారు.

సబ్సిడీతో విత్తనాలు

పాడి రైతులు ఇబ్బందులు ఎదుర్కోకుండా ప్రభుత్వం 75శాతం సబ్సిడీతో పశుగ్రాస విత్తనాలను పంపిణీ చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో పరిగి ఏడీ అంకం రాజు, మండల పశువైద్యాధికారి చందన, కిష్టాపూర్ పశువైద్యాధికారి జోస్నా, రంగాపూర్ పశువైద్యాధికారి ఆనంద్‌కుమార్, వీఎల్ఓ స్వప్న, వీఏ శివకుమార్, పశువైద్య సిబ్బంది బాబయ్య, వెంకటేశ్, రాజు, రాములు, రమేశ్, మోతీలాల్, తాలూకా ఆత్మ చైర్మన్ కె.శ్రీనివాస్‌రెడ్డి, పరిగి మార్కెట్ కమిటీ చైర్మన్ పరుశురాంరెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ యాదవరెడ్డి, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు మాలి విజయ్‌కుమార్‌రెడ్డి, ఆత్మ డైరెక్టర్లు లింగయ్య, రాజశేఖర్‌రెడ్డి, నర్సింహులు గౌడ్, రాజేశ్‌రెడ్డి, ఏఎంసీ డైరెక్టర్లు ప్రభాకర్‌రెడ్డి, శాంత కుమార్, బందయ్య, నర్సింహులు, జిల్లా గ్రంథాలయ సంస్థ డైరెక్టర్ యాదయ్యగౌడ్, కాంగ్రెస్ యూత్ అధ్యక్షుడు శ్రీకాంత్‌రెడ్డి, మాజీ సర్పంచ్ నరేందర్‌రెడ్డి, మాజీ ఉపసర్పంచ్ చెన్నయ్య, కాంగ్రెస్ నేతలు అర్జున్‌రెడ్డి, రాఘవేందర్‌రెడ్డి, అంతిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.


పూడూరు: గాలికుంటు నిరోధక టీకాలను పశువులకు తప్పనిసరిగా వేయించాలని పశువైద్యాధికారి సుజిత్ పేర్కొన్నారు. బుధవారం మండల పరిధిలోని కంకల్, అంగడిచిట్టంపల్లి, పూడూరు పశువైద్య కేంద్రాల్లో టీకాలు వేసే కార్యక్రమం నిర్వహించారు. నేటి నుంచి నవంబర్ 14 వరకు గాలికుంటు వ్యాధి నిర్మూలన టీకాలు వేయనున్నట్లు తెలిపారు. రైతులు తమ పశువులకు వేయించి తమ పశువులను కాపాడుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వైద్య సిబ్బంది గోపాల్ పాల్గొన్నారు.

దౌల్తాబాద్: పశువులకు గాలికుంటు టీకాలు వేయించాలని మండల పశువైద్యాధికారిణి వరలక్ష్మి తెలిపా రు. ఆయా గ్రామాల్లో గాలికుంటు నివారణ టీకాల కార్యక్రమం చేపట్టినట్లు ఆమె తెలిపారు. ప్రతీ రైతు పశువులకు టీకాలు వేయించాలని సూచించారు. మండలంలోని అంతారంలో 80పశువులకు టీకాలు వేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సిబ్బంది సత్యనారాయణరెడ్డి, అన్వర్, గోపాలమిత్రలు అనంతయ్య, వెంకటేశ్, ఆశప్ప పాల్గొన్నారు.

మోమిన్‌పేట: పశువులకు గాలి కుంటు నివారణ టీకాలు వేస్తున్నట్లు మండల పశు వైద్యాధికారి గీత పేర్కొన్నారు. చంద్రాయన్‌పల్లి, మొరంగపల్లోల్ల గాలి కుంటు నివారణ టీకాలు వేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ మండలంలో రెండు బృందాలుగా ఏర్పడి పశువులకు గాలి కుంటు నివారణ టీకాలు వేస్తున్నామన్నారు.



మోమిన్‌పేట: చంద్రాయన్‌పల్లిలో టీకా వేస్తున్న గీత తదితరులు



దోమ: శివారెడ్డిపల్లిలో పశుగ్రాస విత్తనాలను పంపిణీ చేస్తున్న పశువైద్య సిబ్బంది, నేతలు



పూడూరు: టీకా వేస్తున్న వైద్య సిబ్బంది



దౌల్తాబాద్: అంతారంలో టీకా వేస్తున్న పశువైద్య సిబ్బంది